# మానవులం కాబట్టి—

(కథానిక)

అగ్గిపుల్లగీసి, కాగితాన్ని చక్కగా మడిచి నిప్పంటించి మంట జాజ్వల్యమానంగా వెలుగుతూవుంటే సుబ్బారావు తృప్తిగా నవ్వుకున్నాడు. మంట ఆరిపోయేవరకూ అతని ముఖంలో ఏదో భయంకరహాసం తొణికిసలాడుతూనే వుంది. మంటలారి నల్లగా మాడివున్న కాగితంలో అక్షరాలింకా అస్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. రెండుచేతుల్తోనూ గట్టిగా పులిమేడు. కుళాయిని సన్నటి ధారగాచేసి రెండుచేతులూ ఆ ధారకి సూటిగాపెట్టి అతిసున్నితంగా సబ్బుపెట్టిరాసి కడుక్కున్నాడు. తువ్వాల్తో కడిగిన చేతుల్ని తుడుచుకుంటూ గంభీరంగా నవ్వుకున్నాడు. అంతా ఆయిదునిమిషాల్లో గప్‌చిప్‌గా జరిగిపోయింది. అంతా అయిపోయింది. ఇంక ఆ తాలూకు అణుమాత్రమైన చిహ్నంకూడా లేదు. సావకాశంగా కూర్చున్న సుబ్బారావు మెదడు క్రమంగా పనిచేయటం ప్రారంభించింది. అతనికళ్ళు చూస్తున్నాయి. ఆదేపనిగా నిశ్చలంగా చూస్తున్నాయి. కాదు పొరబాటు. వాటిల్లో చూపులేదు. బుర్రతోపాటువికూడా దీర్ఘంగా ఆలోచిస్తున్నాయి. అతని హృదయంలో గతకాలం, ప్రస్తుతకాలం రెండు మానవాకృతుల్లో కచాకచీ యుద్ధం ప్రకటించాయి. గతకాలం తనను పెంచిపోషించిన మాతృదేవి, ప్రస్తుతకాలం స్వార్థావసరాల నిమిత్తం వీడు నాకొడుకని పోట్లాడుతున్న సవతితల్లి...

సుబ్బారావు మెదడులో సుడిగుండాలు తిరుగుతున్నాయి. హృదయంలో భూకంపాలు గర్జించాయి. అతని అణుకణువునా ఏదో అర్థంకాని ఆవేదనలు, అస్పష్టంగా నరనరాలా ప్రవహించే రక్తంలో అంతర్వాహినిగా నడుస్తూన్న ప్రతీకారవాంఛా, కదుల్తున్నాయి. హృదయ ధ్వనులతో కంఠంకలిపి రోదిస్తున్నాయి.

'అరె...నాన్న ఉత్తరాన్ని మరో మాటు చూసేందుకన్నా లేకుండా అంటించానేమిటి?" సుబ్బారావు కల్లోలిత హృదయంలో మేఘాల్లో మెరుపులాగ ఏ చీకటిమూలనుంచో ఏదో అస్పష్టమైన గొంతుకలోంచి ఏదో మూలుగు. అప్రయత్నంగా పెదిమలు కరుచుకున్నాడు సుబ్బారావు. మామూలుగా కూడా కాదు. నాలుకతో సహా. నొప్పిపుట్టి జ్ఞాపకం ఉండేటట్టు కరుచుకున్నాడు. హఠాత్తుగా కడుపులో కళ్ళల్లో ఓ వింతభావం మెదిలింది. "తాను తప్పుపని చేశాడా? ఇంకా తను తప్పుదారినే పయనించి పోతున్నాడా?" ఏది చెయ్యాలి? ఏది చెయ్యకూడదు?

ఛీ! అర్థంలేనిఘోష. ఈ విషయంలో తను ఇంతగా బుర్ర పాడుచేసుకోటం అనవసరం. పది సంవత్సరాలనుంచి ఏకాకిగా జీవిస్తూన్న ఈజీవం మరోకొంత కాలంపాటు (అదేం? బతికుండేదాకా కూడానూ) అల్లాగే జీవించగలదు. ఈ ప్రాణికి నా అనేవాళ్ళేనాడో గతించారు. లోకంలో ఒకరినుండి ఇంక తను ఆశించదగిన బంధుత్వాలుగాని, మరే ప్రేమానురాగాలుగాని మరి లేవు. సుబ్బారావుకి గత జీవితదృశ్యాలు క్రీనీడల్లా ఫాంటసీల్లా అస్పష్టంగా కనిపించి అదృశ్యమౌతున్నాయి. ఏనాడో కారికారి తడి ఆరిన సుబ్బారావు కళ్ళే తిరిగి ఈనాడు, ఈ నిమిషంలో చెమరుస్తున్నాయి. తన జీవితం తల్చుకుంటేనే ఏదో వేదనాభరితమైన అభిమానం ముంచుకొస్తోంది. తనెంత? తన బ్రతుకెంత? దానికి కారకులెవరు? ఇవన్నీకలిసి తన నెంతగా మార్చాయి! జీవితంలో సుఖగౌరవాలకి ఏమాత్రం ఆస్కారం లేకపోయినా సంతృప్తి ఉంది. అది చాలు తనకి.

క్షణకాలం సుబ్బారావు హృదయంలో ఆశ్చర్యము మొలకనవ్వులు నవ్వింది. పాపం చేసిన వాళ్ళని ఏనాటికైనా భగవంతుడు శిక్షిస్తాడు!"

వి. యస్. కళ్యాణి

సుబ్బారావు అమాయకంగా జోహార్లిచ్చాడు భగవంతుడికి. అతడు న్యాయాన్యాయ విచక్షణుడు. ప్రజల కళ్ళెంత మూసుకుపోయి ఆ మహానుభావుణ్ణి చూడలేకపోయినా అతనొకంటు మనని కనిపెడుతూనే ఉంటాడు. క్షణకాలంలోనే సుబ్బారావు విపరీతమైన భక్తిభావంలో తన్మయత్వం పొందేడు.

సుబ్బారావు మనస్సులో ఏదో దృఢనిశ్చయం తొడుగులు తొడిగింది. తను వెళ్ళడు. తెగిన తీగల్ని తిరిగి బంధించడు. ఇనుము విరిగినా అతికించవచ్చు కాని మనసు విరిగితే దానికి మందులేదన్నాడు వేమనేకాబోలు. "మహానుభావుడు! జీవితాన్ని అక్షరాల్లో పొదిగిపెట్టేడు! సుబ్బారావు కాపద్యం హఠాత్తుగా గుర్తుకొచ్చింది. అతను చదువుతున్నది కూడా అంతకుమించి అట్టేలేదు కనక అతని కాపద్యం జ్ఞాపకంఉంది. గొప్ప వాళ్ళకి వేం గుర్తుంటాయి గనక!

సుబ్బారావు పెదిమలు తిరిగి హసించాయి. మళ్ళీ బిగదీశాయి. అతను తన ముఖాన్నోసారి అద్దంలో చూసుకున్నాడు. అక్కడా అక్కడా జుట్టు పాయలుగా తెల్లబడింది. అసలువయస్సు కన్నా ఎక్కువే చూపిస్తోంది మొద్దుబారిన ముఖం. తన జీవితం అందరు యువకుల జీవితాల్లోగా తల్లిదండ్రుల అండన సాగివుంటే? తన తండ్రి ప్రేమానురాగాలతో తనకి విద్యాబుద్ధులు చెప్పించివుంటే? ఈ రోజు తనని బ్రతిమాలుతూ రమ్మనమని జబ్బుగావున్న ఈ వ్యక్తి, తనకు తండ్రిగా లోకం విధించినవాడు నిజంగా తండ్రి కుండవలసిన బాధ్యతలతో ప్రవర్తిస్తే? తన జీవితం ఇలావుండేదా? మూడుపువ్వులు, ఆరు కాయలుగా వుండవలసిన తన జీవితక్షేత్రాన్ని నట్టేటముంచాడు ఈ తండ్రి! చెక్కిళ్ళల్లో పాలుగారే వయస్సులో, కామప్రలోభంలో పడిపోయి కానకుండా రెండోభార్య మోహంలో కన్నూ కారణరహితంగా తనను ఇంటినుంచి బైటికిగెంటిన ఈ వ్యక్తి తన తండ్రి! ఆయన ఆశలు కేంద్రీకరింపబడిన రెండోభార్యకొడుకు అకస్మాత్తుగా చావడంతో, శ్రేయోభిలాషులైన తన బంధువర్గం దూరంగా తప్పకుంటున్న సమయంలో ఇన్నేళ్లూ గాలిలోకి విసిరేసిన ఈ కొడుకు గుర్తుకొచ్చి పశ్చాత్తాపం కలిగిందేం? చూడాలని అనిపించి నట్టుంది! అయినా తను బ్రతక నేర్చకపోలేదు. ఏదో బ్రతుకు ఏదో జీవితం గడ్డి బ్రతుకూ... గడ్డి తినే పశువు జీవితం...ప్రపంచంలో ప్రాణం నిలబెట్టుకుని (మానం సంగతి ఎటుపోయినా) బతకడానికనేకమార్గాలు! తను జీవించేందుకారడుగుల నేల లేకపోలేదు భూమిమీద. లోకం తనను లక్ష్యపెట్టదు. దాన్ని తను లక్ష్యపెట్టడు. తనకీ కాలం మళ్లుతోంది. సాఫ్ సీదాగా ఏ బాదరబందీ లేకుండా సాగుతూన్న జీవితాన్ని తిరిగి మరో మార్గంలో పెట్టి బంధించటం తనకి సుతరామూ ఇష్టంలేదు. అయినదేదోఅయింది. కాబోయేది కాక మానదు. కాఫీ హోటల్ సర్వర్ పనిచేస్తూ పొట్ట పోషించుకుంటున్నాడని సంఘంలో గౌరవం ఎంత లేకపోయినా తన కాత్మాభిమానం లేకపోలేదు. తను తిరిగి ఇన్ని సంవత్సరాలకి ఆ యింట్లో అడుగుపెట్టడు. తండ్రికి జబ్బుగా వుంటే మాత్రం తనెందుకు లెక్కచెయ్యాలి? ప్రపంచంలో అనేకాకర్షణలు తనని పీడిస్తే, అనుభవించే స్తోమత తనకి లేకపోతే జీవితం బాధాకరంగా పరిణమిస్తే ఏకాకిగా జీవిస్తూ కన్నీరు కారుస్తే, దీనికంతకీ కారకులెవరు? తన జన్మమూలంగా తను బాధపడుతూన్నదే ఎక్కువ. ఒకరికోసం జాలి పడాల్సిన—అందులోనూ తనతండ్రికోసం—అవసరం ఎంతమాత్రంలేదు.

* * *

సుబ్బారావు తనచుట్టూవున్న స్నేహితుల్తో సంప్రదిస్తే నలుగురూ నాలుగుమాటలూ చెప్పారు. ఒకడు తనను అభినందించాడు. మరొకడు తల్లిదండ్రులెటువంటి వాళ్ళైనా వాళ్ళదగ్గిరనాఅత్మాభిమానాలు చూపించేం?-అన్నాడు. తనకది పిచ్చిగా తోచింది. కాని కృష్ణమూర్తి, తనతోటి సర్వరే చెప్పిన విషయాలుమాత్రం వినడానికింపుగా వినిపించాయి. ఏదో హృదయసంస్కారం, మానవత్వపు బాధ్యతలు అంటూ ఓ పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు. ఏ మానవత్వం మూలకంగా ఆత్మాభిమానం పుట్టిందో అదే కారణంగా క్షమాగుణం కూడా మానవుడు పెంపొందించుకో వలసిన సొమ్మన్నాడు. "నువ్వు మనిషివి కాబట్టి నీ యందు నీకు గౌరవం ఉంది. నీ తండ్రికి

డుకువిగా పుట్టినందుకు కాదు నీబాధ్యత ర్వర్తించాల్సింది, నీవు క్షమాగుణం కల మానవుడివి కాబట్టి, మనుషులు ఇతరులవల్ల బాధపడటంకన్నా వారివల్ల వారే బాధపడటం అధికం అని గుర్తించవలసిన బాధ్యత నీకుంది కాబట్టి ఈ పని నువ్వు చెయ్యాల్సివుంటుంది. ఇందులో నీ ఆత్మాభిమానానికి కలిగే దెబ్బ ఏదీ లేదు..అన్నాడు కృష్ణమూర్తి. వినటానికి బాగానే ఉన్నా తనకంతగా రుచించలేదు. బాధపడిన వాడు తను కనక అందులో కష్టనష్టాలు తనకి తెలిసినంత ఇతర్లకి తెలియవు. ఫలితం చివరికి ఏమిటీ అంటే మరణతల్పం మీదనున్న తండ్రిని చూడటానికి సుబ్బారావు వెళ్ళలేదు.

* * *

వారం తిరిగింది. సుబ్బారావు పేర ఒక రిజిస్ట్రీ చేసినకవరు వచ్చింది. ఇన్సూరెన్సుకి సంబంధించిన పుస్తకం, కాగితాలూ చాలాఉన్నాయి. ఒక కాగితంలో తన తండ్రిదస్తూరితో ఏదోరాసిఉంది. ఆత్రంగా చదువుతున్నాడు.

“నువ్వురావని నాకు తెలుసుబాబూ! అయినా ఏదో ఆశఒకటి వేధించబట్టి ఆ ఉత్తరంరాశాను. నేనేవచ్చి నిన్ను చూడాలనుకున్నాను. కాని మొహం చెల్లక తటపటాయించాను. ఎందుకు? ఏం అనుకుని ఏంలాభం? కర్మ మనని నడిపిస్తుంది. నీ జీవితాన్ని నేను పాడుచేశాను నాయనా... కాని...ఏంచెప్పను నా బాధ ... ఏలా అర్థం అవుతుందినీకు?...

పశ్చాత్తాపం కలిగింది కాని సమయం మించి పోయింది...తండ్రి బాధ్యతల్ని ఈనాడు నేను గుర్తించి మాత్రం చేయగలిగిందిలేదు...ఏమీ... మరణశయ్య మీదుండి ఈ చిన్నకానుకని స్వీకరించమని నా ప్రార్థన తండ్రీ ... అవసరమైన కాగితాలన్నీ ఇందులో ఉన్నాయి. నేను నా పాపానుభవంకోసం ప్రయాణమై పోగానే ఇది నీవద్దకువస్తుంది.

కాని నువొస్తావని నిన్నుచూసి నా చిరునవ్వుతో నా పాపాన్ని ప్రక్షాళించుకోవాలని నా కోరిక కోరికలాగే ని...లి...చి...పో... యిం...ది బా...బూ...

ఇంతకన్నా ఏదీవ్రాసి నిన్ను బాధించ తలుచుకోలేదు నాయనా. చిన్నవాడవైనా వంచిన శిరస్సుతో నీకు విన్నవించుకొన్న నాకోరికను స్వీకరించి నాకు ఆత్మశాంతినిస్తావని ఆశిస్తున్నాను ఇట్లు”...

తండ్రిపేరు కనిపించనేలేదు. కళ్ళల్లో నీళ్ళుదట్టంగా కమ్మేశాయి. ఉత్తరంజారి కింద పడింది. రెండుచేతులూ ముఖానికి అడ్డుగా పెట్టుకుని భోరున ఏడ్చాడు సుబ్బారావు. కృష్ణమూర్తి వచ్చాడు. కిందపడ్డ కవరుతీసి చూశాడు.

“నువ్వు చెప్పినమాటలు చెవినిపెట్టాను. పొరబాటు జరిగిపోయింది కృష్ణా...” మరి మాట్లాడలేకపోయాడు. దుఃఖం పొంగివచ్చింది సుబ్బారావుకి. కృష్ణమూర్తి మౌనంగా కూర్చుని వున్నాడు.

రెండునిముషాల తర్వాత కృష్ణమూర్తి “మానవులం కాబట్టే తప్పులు చేస్తాం ... మనుషులం కాబట్టే ఏడుస్తాం... రెండూ చేయగలగటమే మానవత్వంలో ప్రత్యేకత... ఇంతలో విచారించవలసిన పని లేదోయ్...” అన్నాడు. సుబ్బారావు ముఖం, చేతులూ కన్నీళ్ళల్లో తడిసిపోయినా ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు.

---

“భారతీయచిత్రకళ అనేది చేతిపనులు వృత్తిగాగలట్టివారిచే సృష్టింపబడింది” అని డాక్టర్ కుమారస్వామి అన్నారు. పూర్వకాలంలో లలితకళలనీ, ఉపయోగ్య కళలనీ, అలంకార కళలనీ వేర్వేరుగా లేనట్లు కన్పిస్తుంది. ఆనాడు కళాకారుని కున్నట్టి సహాయప్రోత్సాహాలు ఈనాడు లేవు. ఇందువల్లనే ప్రజలలో కళాభిరుచి క్షీణించి, కళాప్రమాణాలు దిగజారిపోయినవి. ఒకవంక నిత్యజీవితంలో సుందరత లేకపోవడం, మరొకవంక కళాకారునికి ప్రజాపోషణ లేకపోవడం—ఈ రెండే కళారంగంలో నేటి హీనావస్థకు ముఖ్యకారణాలు.